సాక్షి తిరుపతి

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



అంతరాలయానికి రాగి తొడుగులు
కాణిపాకం వినాయకుని అంతరాలయానికి త్వరలో రాగి తొడుగులు అమర్చనున్నట్లు అధికారులు ఆదివారం తెలిపారు.



రూ.5కోట్లతో అభివృద్ధి
బోయకొండ గంగమ్మ ఆలయంలో రూ.5కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.



భార్యను చంపిన భర్త
ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను ఓ కసాయి భర్త అత్యంత కిరాతకంగా కత్తితో పొడిచి హత్య చేశాడు.

- IIలో

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో ప్రముఖులు




దుర్గా ప్రసాద్‌రావు, రాఘవేంద్రరావు

తిరుమల : తిరుమల శ్రీవారిని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాద్ రావు, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు సోమవారం సేవించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 85,497 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,873 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.41 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమతోంది. టికెట్లు లేని వారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

కాశీ మఠం పీఠాధిపతికి చిన్న మర్యాద



ధ్వజస్తంభం వద్ద పీఠాధిపతి

తిరుమల : వారణాసిలోని కాశీ మఠం సంస్థాన్ ప్రధాన పీఠాధిపతి సంయమందీంద్ర తీర్థ స్వామీజీకి సోమవారం శ్రీవారి ఆలయంలో టీటీడీ తరపున చిన్నమర్యాద చేశారు. అర్చకస్వాములు, టీటీడీ డిప్యూటీ ఈఓ లోకనాథం ఇస్తికఫాల్ స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

తీర ప్రాంతంలో చలిగాలులు

చిల్లకూరు : వాతావరణంలో మార్పుల కారణంగా రెండురోజుల నుంచి తీర ప్రాంతంలో చలిగాలులు వీస్తున్నాయి. సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సముద్రం కసురు మీద ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు. తీర ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

వర్సిటీల్లో పర్మినెంట్ పోస్టులకు నోటిఫికేషన్

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ, మహిళా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు ఎస్వీయూలో 156 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 50 అసోసియేట్ ప్రొఫెసర్లు, 44 ప్రొఫెసర్లు, 11 ఎస్సీ,ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయనున్నారు. మహిళా యూనివర్సిటీలో సుమారు 100 పైగా పలు కేటగిరిల్లో పర్మినెంట్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు.

సకాలంలో సమస్యల పరిష్కారం

తిరుపతి అర్బన్ : స్పందన అర్జీల్లో పేర్కొన్న సమస్యలను సకాలంలో పరిష్కరించాలని జేసీ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీతోపాటు డీఆర్‌ఓ పెంచల కిషోర్, లీగల్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ప్రొటోకాల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ ఎక్కడి అర్జీలను అక్కడే పరిష్కరించాలని సూచించారు. స్పందనకు మొత్తం 172 వినతులు వచ్చినట్లు వెల్లడించారు.

సెరి.. సిరి



జిల్లాలో పట్టు పరిశ్రమ శరవేగంగా విస్తరిస్తోంది. రైతులకు లాభాల పంట పండిస్తోంది. సెరికల్చర్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వివిధ రూపాల్లో రాయితీలు అందిస్తోంది. మల్బరీ సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అన్నదాతలు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేందుకు పూర్తి సహకారం అందిస్తోంది. ఈ మేరకు అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్నారు. అవసరాల మేరకు సలహాలు అందిస్తూ అండగా నిలుస్తున్నారు.

- లాభాలు కురిపిస్తున్న పట్టు పురుగుల పెంపకం
- రాష్ట్రంలో జిల్లాకు రెండో స్థానం
- 14 మండలాల్లోని 2,260 ఎకరాల్లో సాగు
- 1343 మంది రైతులకు ఇదే జీవనాధారం
- రాయితీలో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

తిరుపతి అర్బన్ : వ్యవసాయంతోపాటు అనుబంధరంగాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తోంది. అందులో పట్టు పురుగుల పెంపకం (సెరి కల్చర్)మరింతగా విస్తరించేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా పలు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. ఈమేరకు మల్బరీ పట్టు పురుగుల పెంపకంలో జిల్లా రాష్ట్రస్థాయిలో రెండో స్థానం దక్కించుకుంది. ఇక్కడి రైతులు ఏడాదిలో మూడు నుంచి పది పంటల వరకు పట్టుపురుగులు సాగుచేస్తున్నారు. దీంతో ఎకరానికి పెట్టుబడులు పోను రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారు.

14 మండలాల్లో సాగు

2018కి ముందు జిల్లాలో కేవలం 8మండలాల్లో మాత్రమే మల్బరీ పట్టుపురుగుల సాగు ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పలు ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో రైతులు అధికంగా సెరికల్చర్ వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 14 మండలాల్లో సాగు చేస్తున్నారు.



పట్టు పురుగుల షెడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మరో ఆరు మండలాల్లో సాగు చేపట్టే దిశగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అందులో భాగంగా భూసార పరీక్షలు చేపడుతున్నారు. ప్రస్తుతం చిన్నగొట్టిగల్లు ,ఎర్రవారిపాళెం,ఏర్పేడు,తిరుపతి రూరల్, రేణిగుంట ,చంద్రగిరి ,పుత్తూరు, రామచంద్రాపురం, పిచ్చాటూరు, వడమాలపేట, శ్రీకాళహస్తి, కేవీబీపురం, నాగలాపురం, నారాయణవనం ,పాకాల మండలాల్లో మాత్రమే పట్టుపురుగుల పెంపకం సాగుతోంది. వచ్చే ఏడాది నుంచి తొట్టంబేడు, వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లె, నాయుడుపేట,పెళ్లకూరు తదితర మండలాల్లోను సాగు చేయడానికి రైతులను ప్రోత్సహిస్తున్నారు.

జిల్లా సమాచారం

సెరి కల్చర్ సాగు విస్తీర్ణం :	2,260 ఎకరాలు
మొత్తం రైతులు	: 1,343
మొక్కల నాటేందుకు ఇచ్చిన రాయితీ :	రూ.72లక్షలు
రీలింగ్ షెడ్ల నిర్మాణానికి :	రూ.1.27 కోట్లు
షార్ట్ రీలింగ్ స్టాండ్లకు :	రూ.9.55లక్షలు
నేత్రికలకు :	రూ.3.49లక్షలు

రాయితీలు ఇవీ..



మల్బరీ మొక్కలు పెంచే రైతులకు ఎకరానికి రూ.18,750 రాయితీతో రూ.50వేలు అందిస్తున్నారు. అలాగే షూట్ స్టాండ్ల నేత్రికలు(పట్టుగూళ్లకు) యూనిట్‌కు రూ.56,250 సబ్సిడీతో రూ.లక్ష చొప్పున పంపిణీ చేస్తున్నారు. మరోవైపు రీలింగ్ షెడ్ల ఏర్పాటు కోసం యూనిట్‌కు రూ.3లక్షల రాయితీతో రూ.4లక్షలు ఇస్తున్నారు. ఈ క్రమంలోనే ఉపాధిహామీ పథకం ద్వారా పట్టు పరిశ్రమ అభివృద్ధికి ఎకరానికి రూ.11 వేలు చొప్పున అందిస్తున్నారు.తెల్ల పట్టుగూళ్లకు కిలోకు రూ.50 ఇన్సెంటివ్ అందిస్తున్నారు. బిందు సేద్యం కింద 90శాతం రాయితీతో డ్రిప్, స్ప్రింకర్లు సరఫరా చేస్తున్నారు. తద్వారా నీటి పొదుపునకు సహకరిస్తున్నారు.

భారీగా ప్రోత్సాహకాలు

ప్రభుత్వం మల్బరీ పట్టు పరిశ్రమకు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తోంది. ప్లానిటేషన్ నుంచి గూళ్ల ఏర్పాటుతోపాటు అన్నింటికి రాయితీలు ఇస్తోంది. దీనివల్లే సాగు ఏటా పెరుగుతోంది. అధికంగా సాగును పెంచేందుకు అధికారులు సైతం అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పట్టుగూళ్లకు మాకు కూడా సబ్సిడీ అందించారు. పట్టు పురుగుల పెంపకం లాభదాయకం.
– దేవేంద్రరెడ్డి, కె.వత్తేపల్లె, పాకాల మండలం



పర్యవేక్షణ అభినందనీయం



అధికారులు పర్యవేక్షణ అభినందనీయం. పంట సాగు నుంచి చివరి దశ వరకు నిత్యం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తున్నారు.
– ఈశ్వర్‌ప్రసాద్, గణేశ్‌పురం, ఆర్‌సీపురం మండలం

మరింతగా పెంచుతాం



జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను మల్బరీ పట్టుపురుగుల సాగును చేయించాలనే ఆలోచనతో ఉన్నాం. అందుకే చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. మరింతగా పట్టుపురుగుల పెంపకాన్ని పెంచుతాం. రైతులు సిద్ధంగా ఉంటే చాలు.. మేమే అన్ని సదుపాయాలు కల్పిస్తాం. వారు లాభాలు ఆర్జించేలా పూర్తి సహకారం అందిస్తాం.
– గీతారాణి, సెరికల్చర్ జిల్లా అధికారి

ఖాదీ ఫెస్ట్-2023 ప్రారంభం



ఖాదీ ఫెస్ట్ ప్రారంభిస్తున్న మేయర్ శిరీష, కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని పాత తిరుచానూరు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో సోమవారం రాష్ట్ర స్థాయి ఖాదీ ఫెస్ట్–2023ను కలెక్టర్ వెంకటరమణారెడ్డి, మేయర్ శిరీష ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి, మంగళగిరి, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఖాదీ ఫెస్ట్‌కు జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకారం చుట్టారు. మేయర్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో నేతన్నలకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. ఖాదీ వస్త్రాలను ఆదరించి చేనేతను ప్రోత్సహించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకం ద్వారా నేతన్నలకు బ్యాంకుల నుంచి రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నేతన్న నేస్తం క్రింద అర్హులైన వారికి ప్రభుత్వం ఏటా రూ.24వేలు ఆర్థిక సాయం అందిస్తోందని వెల్లడించారు. ఖాదీ ఫెస్ట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో ఖాదీ బోర్డు సీఈఓ విజయరాఘవ నాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, ఖాదీ అధికారి వెంకట్‌రామ్, ఏపీ కేవీఐబీ అధికారులు రమేష్‌బాబు, ఖాదర్, రవికుమార్, సాయిప్రసాద్, వరప్రసాద్, రామలింగారెడ్డి, కేవీఐసీ అధికారులు కోటిరెడ్డి, మూర్తి పాల్గొన్నారు.

ప్రొఫినోఫస్ పురుగు మందు వాడొద్దు

తిరుపతి అర్బన్ : న్యూఢిల్లీ వారు తయారు చేసిన ప్రొఫినోఫస్ పురుగు మందును రైతులు వినియోగించవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్ రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బ్యాచ్ నంబర్ టాగ్ 220016, ట్రేడ్ పేరు ట్యాగ్ ప్రోతో తయారు చేసిన ఈ పురుగుమందు ప్రభుత్వ ప్రామాణిక పరీక్షల్లో నిర్ధారిత ప్రమాణాలతో తయారుచేయలేదని వెల్లడించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ కమిషనర్ గుంటూరు వారు గుర్తించినట్లు వివరించారు. ఈ పురుగుమందును రైతులు కొనుగోలు చేయవద్దని సూచించారు.

స్వామి సేవకు రండి..!



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి రూరల్: భక్తులకు రసాయనాలు లేని అన్న ప్రసాదాలు వితరణ చేసేందుకు కూరగాయలు, గోశాలలోని పశువులకు గ్రాసం ఇచ్చేందుకు ప్రకృతి వ్యవసాయ రైతులు ముందుకు రావాలని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం తిరుపతిలోని శ్వేత భవనంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ, హైబ్రిడ్ నేపియర్ పశుగ్రాసం, కూరగాయలను టీటీడీకి సరఫరా చేసేందుకు సేంద్రియ రైతులతో బై బ్యాక్ ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. తిరుపతి, పలమనేరు, నెరబైలు వద్ద కమలయ్యగారిపల్లెలో టీటీడీ నిర్వహిస్తున్న గోశాలలకు రోజుకు 30 టన్నుల పశుగ్రాసం అవసరమవుతుందన్నారు. ఈ గ్రాసాన్ని సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడి పండించాలని, టన్నుకు రూ.2 వేలకు పైగా ధర చెల్లిస్తామన్నారు. కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ పంటల సాగుతో రాబోయే తరాల వారికి కూడా మంచి చేసిన వారమవుతామని చెప్పారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా రైతులతో సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో టీటీడీ జేఈఓ సదాభార్గవి, టీటీడీ గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయించేందుకు వ్యాయామం



బీపీ చెక్ చేయించుకుంటున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం : పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడిని జయించేందుకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా సోమవారం ఎమ్మార్‌పల్లె వద్ద ఏఆర్ పరేడ్ మైదానంలో పోలీసు కుటుంబాల కోసం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం పోలీసు సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తుంటారన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రముఖ ఆస్పత్రుల డాక్టర్లతో వైద్యశిబిరం ఏర్పాటు చేయించినట్లు వెల్లడించారు. జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ గైనకాలజీ, కార్డియాలజీ ఈఎన్‌టీ, యూరాలజీ, ఫిజియోథెరపీ, కళ్లు, దంతాలకు సంబంధించిన స్పెషలిస్ట్ వైద్యులు సేవలందిస్తున్నారని వివరించారు. ఈ అవకాశాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, లక్ష్మీనారాయణ రెడ్డి, పోలీస్ డాక్టర్ మాధురి, డీఎస్పీ గిరిధర్ పాల్గొన్నారు

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తుకు చివరి గడువు నవంబర్ 7 వరకు ఉంటుందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ యస్.విశ్వనాథ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. 9వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులు అర్హులని, 11వ తరగతికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రస్తుతం 10వ తరగతి విద్యార్థులు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి విద్యార్థులు 2009 మే 1 నుంచి 2011 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2007 జూన్ 1 నుంచి 2009 జూలై 31 మధ్యన జన్మించిన వారై ఉండాలన్నారు. పరీక్ష తేదీ 10 ఫిబ్రవరి 2024న ఉంటుందన్నారు. వివరాలకు 8688888802, 9399976999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మొక్కల వైవిధ్యతతో ఆహార భద్రత

తిరుపతి సిటీ : మొక్కల వ్యాధికారకాల్లో వైవిధ్యతను ముందుగా గుర్తిస్తే ఆహార భద్రత సాధించవచ్చని వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల ప్లాంట్ పెథాలజీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ ఉన్నత విద్య ప్రాజెక్ట్ సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక కింద అధ్యాపకులు, పీజీ విద్యార్థులకు ఆరు రోజుల శిక్షణను ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా మొక్కల అధికారకాల్లో వైవిధ్యత వస్తోందన్నారు. వర్సిటీ బోర్డు మెంబర్ డాక్టర్ పీవీ సత్య గోపాల్ మాట్లాడుతూ వాతావరణ మార్పులతో మొక్కల్లో తక్కువ ప్రాముఖ్యత కలిగిన వ్యాధులు ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకుంటున్నాయని తెలిపారు. వీటిపై అవగాహన పెంపొందించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రిన్సిపల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ, తదితరులు

డాక్టర్ జి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు చేపట్టడానికి కావలసిన నైపుణ్యతను యువత సాధించాలని సూచించారు. పరిశోధన సహ సంచాలకుడు డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ కృత్రిమ మేథస్సు కూడా వ్యాధులను నియంత్రించడంలో సహాయ పడుతుందని వెల్లడించారు. ప్లాంట్ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.రెడ్డి కుమార్ మాట్లాడుతూ శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు.

సంక్షేమ పాలనకు ప్రశంసలు

సైదాపురం : 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆనందంగా జీవనం సాగిస్తున్నాం. మూడు పూటలా ముద్ద తింటున్నాం. సంక్షేమ పథకాల సాయంతో సగౌరవంగా పనిచేసుకుంటున్నాం' అంటూ ఊటుకూరు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని ఊటుకూరులో వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రతి చోటా ఇవే ప్రశంసలు వినిపించాయి. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బుక్‌లెట్ అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో



వృద్ధురాలిని పలకరిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

గ్రామానికి చెందిన ఓ 80 ఏళ్ల వృద్ధురాలు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి వద్దకే ఠంచన్‌గా పింఛన్ అందుతోందని సంతోషంగా వెల్లడించారు. వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్ పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా ఆర్టీసీ సేవలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ సేవలు ఆదర్శవంతంగా ఉండాలని జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లాలోని 11 డిపోల మేనేజర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని డిపోల బస్సు సర్వీసులు తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌కు రాకపోకలు సాగిస్తాయన్నారు. ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్న తరుణంలో ప్రభుత్వం శ్రీనివాస సేతును నిర్మించి, ఆర్టీసీ బస్సులు నేరుగా బస్టాండ్‌లోకి వచ్చే వెసులుబాటు కల్పించిందని వెల్లడించారు. ఈ మార్గాన్ని కేవలం బస్టాండ్‌లోకి రావడానికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. దీనిపై నెల రోజుల క్రితమే ఆదేశాలు జారీ చేసినా, కొన్ని సర్వీసులు అదే మార్గంలో వెళుతున్నాయని మండిపడ్డారు. ఆర్టీసీ బస్సులే అలా వస్తుడడంతో ప్రైవేటు వాహనాలు కూడా అదే దారిని వినియోగిస్తున్నాయని చెప్పారు. దీంతో ట్రాఫిక్ సమస్యలతోపాటు ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. దీనిపై కలెక్టర్ వెంకటరమణారెడ్డి సైతం సీరియస్ అయినట్లు వెల్లడించారు. ట్రాఫిక్



మాట్లాడుతున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

నిబంధనలకు వ్యతిరేకంగా శ్రీనివాస సేతుపై రాంగ్‌రూట్‌లో ఆర్టీసీ సర్వీసులు నడిపితే డ్రైవర్‌తోపాటు డీఎంలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రైవేటు వాహనాలు రాంగ్‌రూట్‌లో వెళితే కఠిన చర్యలు చేపట్టాలని తిరుపతి అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడును ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


సురేష్‌కుమార్ (ఫైల్)

ఏర్పేడు : మండలంలోని సీతారాంపేట వద్ద వేసిన ప్రైవేట్ వెంచర్‌లో ఆదివారం ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఈ మేరకు సీఐ శ్రీహరి వివరాలు వెల్లడించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, దుత్తలూరు మండలం, బ్రహ్మేశ్వరం గ్రామానికి చెందిన సురేష్‌కుమార్(30) చెట్టుకు చీరతో ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

కలువాయి: మండలంలోని వెరుబొట్లపల్లె ఎస్సీ కాలనీలో సోమవారం సాయంత్రం ప్రమాదశాత్తు ట్రాక్టర్ కింద పడి తూమాటి ప్రవీణ్(6) అనే బాలుడు మృతి చెందాడు. ప్రవీణ్ ఆడుకుంటూ ట్రాక్టర్ కిందకు వెళ్లాడు. గమనించని డ్రైవర్ ట్రాక్టర్‌ను ముందుకు కదిలించడంతో వెనుక టైర్ కింద పడి బాలుడు మరణించాడు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు లక్ష్మమ్మ, చిన్న దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

తుడా వెంచర్‌లో ఆక్రమణదారులు

- తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


మీడియాతో మాట్లాడుతున్న తుడా వీసీ హరికృష్ణ

తిరుపతి తుడా : తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పరిధిలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) విక్రయించిన ప్లాట్లకు సంబంధించిన కొనుగోలుదారులు అధైర్య పడాల్సిన అవసరం లేదని వీసీ హరికృష్ణ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే తుడా అభివృద్ధి చేసిన స్థలంలో లే ఔట్ వేసి ప్లాట్లు విక్రయించామని తెలిపారు. బాధితులకు పరిహారం చెల్లించి భూసేకరణ ప్రక్రియ ద్వారా భూములను స్వాధీనం చేసుకున్నామన్నారు. సోమవారం తుడా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేదాంతపురం గ్రామ పరిధిలోని తుడా లేఔట్‌లో ఆదివారం కొందరు అక్రమంగా చొరబడటమే కాకుండా ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించారన్నారు. వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వేదాంతపురం సర్వే నంబర్196, 202, 203, 204లో 25.22 ఎకరాల భూమిని 1992లో ప్రభుత్వ నిబంధనల మేరకు భూ సేకరణ చేసినట్టు చెప్పారు. ఈ కేటాయింపును సవాల్ చేస్తూ గతంలో హైకోర్టులో సి.శంకర్ రెడ్డి, ఇ.పుల్లారెడ్డి ఇతరులు రిట్ పిటిషన్లు దాఖలు చేయగా, వాస్తవిక పరిస్థితుల ఆధారంగా కోర్టు పిటిషన్లను కొట్టివేసిందన్నారు. ఇలా పలుమార్లు పిటిషన్లు దాఖలు చేశారని, 2007లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. అక్కడ కూడా తుడాకు అనుకూలంగా అప్పీల్‌ను కొట్టివేసినట్లు వివరించారు. 2020లో శంకర్ రెడ్డి కొడుకు వంశీవర్ధన్ రెడ్డి రిట్ పిటిషన్ దాఖలు చేయగా సర్వే నంబర్ 203లో 0.50 సెంట్లు స్థలంలో జోక్యం చేసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన కోర్టు, ఆ తరువాత 2023లో పిటిషన్ కొట్టివేసిందన్నారు. ఆ తరువాత కూడా కోర్టు అప్పీల్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. రెండు దశల్లో చేసిన భూ సేకరణ ప్రక్రియలో పరిహారాన్ని బాధితుల బ్యాంకు ఖాతాలలో జమ చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి



కంచి దయానందం మృతదేహం, దయానందం (ఫైల్)

నాయుడుపేటటౌన్ : నెల్లూరు – చెన్నై జాతీయ రహదారిపై మల్లా మార్గం కూడలి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కంచి దయానందం (48) మృతి చెందారు. వివరాలు.. పుదూరు పంచాయతీ కుప్పరగుంట ఎస్టీ కాలనీకి చెందిన దయానందం స్కూటీపై నాయుడుపేటకు వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో దయానందం అక్కడికక్కడే మరణించాడు. లారీని అక్కడే వదిలిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. ఎస్ఐ శ్రీకాంత్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం పుదూరు ఎంపీటీసీ సభ్యులుగా ఉన్న కంచి నరస మ్మ భర్త అయిన దయానందం మృతిపై గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నేతలు సంతాపం తెలియజేశారు. దయానందం మరణవార్త విని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని వెల్లడించారు. సంతాపం తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి ఉన్నారు.

భార్యను చంపిన భర్త

- కిరాతకంగా గర్భిణి హత్య
- బత్తలవల్లంలో దారుణం


పావని (ఫైల్)


నిందితుడు కాటయ్య


సంఘటనా స్థలంలో స్థానికులను విచారిస్తున్న పోలీసులు

వరదయ్యపాళెం : పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినా విచక్షణ మరిచాడు. ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యపై కనికరం వదిలేశాడు. గర్భిణి అనే దయాదాక్షిణ్యం కూడా లేకుండా దారుణంగా హతమార్చాడు. ఇద్దరు చిన్నారులకు తల్లిని దూరం చేశాడు ఓ కిరాతకుడు. కట్టుకున్న భార్యని పాశవికంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన వరదయ్యపాళం మండలం బత్తలవల్లం దళితవాడలో సోమవారం ఉదయం జరిగింది. వివరాలు.. గ్రామానికి చెందిన కాటయ్య సుమారు 8 ఏళ్ల క్రితం నాయుడుపేట సమీపంలోని పూనేపల్లెకు చెందిన పావనిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరూ వేర్వేరు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చేసేవారు. వీరికి ఐదేళ్లలోపు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అయితే ఇటీవల ఇరువురూ ఉద్యోగాలు మానేసి ఇంట్లోనే ఉంటున్నారు. ఈ క్రమంలో తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. తాజాగా సోమవారం ఉదయం 9 గంటల సమయంలో మళ్లీ ఘర్షణ జరగడంతో కాటయ్య ఇంట్లోని కత్తి తీసుకుని పావని(30)పై దాడి చేశాడు. గొంతులో పొడిచి, తలపై మోదడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. అయితే హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని కాటయ్య బుకాయించేందుకు యత్నించినా అక్కడే ఉన్న మృతురాలి కుమార్తె అసలు విషయం చెప్పేసింది. తండ్రే తమ తల్లిని చంపేశాడని వెల్లడించింది. దీనిపై సమాచారం అందుకున్న సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, ఏఎస్ షణ్ముగం తమ సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. హత్యాస్థలాన్ని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాటయ్య తల్లిదండ్రులను సైతం అదుపులోకి తీసుకుని విచారించారు. మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్‌టీమ్ ద్వారా ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించారు.

ఉలిక్కిపడిన గ్రామం

హత్య విషయం తెలియగానే బత్తలవల్లం గ్రామం ఉలిక్కిపడింది. ప్రశాంతమైన పల్లెలో దారుణం జరగడంపై స్థానికులు ఆందోళన చెందారు. నిందితుడు కాటయ్య మానసిక పరిస్థితిపై అనుమానం వ్యక్తం చేశారు. ఉద్యోగం మానేసినప్పటి నుంచి అదోలా ఉండేవాడని చెబుతున్నారు. పావని గర్భం దాల్చడంతో కంపెనీకి వెళ్లకుండా ఇంటికే పరిమితమైందని, అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కాటయ్య గ్రామంలో ఎవరితో మాట్లాడేవాడు కాదని వెల్లడిస్తున్నారు.

విద్యుదాఘాతానికి ఎద్దుల మృతి


ఎద్దుల కళేబరాలు

కేవీబీపురం : మండలంలోని మఠం గ్రామంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై రెండు ఎద్దులు మృతి చెందాయి. వివరాలు వెంకటేష్ అనే రైతు తన ఎద్దులను దున్నకానికి పొలంలోకి తోలాడు. ఈ క్రమంలో సమీపంలోని మోటారు తీగలు తగలడంతో ఎద్దులు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఎద్దుల విలువ సుమారు రూ.1.30 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. తమను ఆదుకోవాలని అధికారులను కోరాడు.

హెచ్‌డీపీపీ ప్రత్యేకాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి


చంద్రశేఖర్‌రెడ్డిని అభినందిస్తున్న పేటశ్రీ

తిరుపతి కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రత్యేక అధికారిగా ఆచార్య ఉగ్రాణం చంద్రశేఖర్ రెడ్డి సోమవారం శ్వేత భవన్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖలో 30 ఏళ్లు అధ్యాపకుడుగా వివిధ హోదాల్లో పని చేశారు. ఆయన పది గ్రంథాలను రచించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో అనేక పరిశోధనా పత్రాలు సమర్పించారు. చంద్రశేఖర్‌రెడ్డిని ఆచార్య పి.నరసింహారెడ్డి, ఆచార్య జె.ప్రతాప్‌రెడ్డి, పేటశ్రీ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నాగలాపురం విద్యార్థులు

నాగలాపురం : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం తిరుపతిలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో వారు ఉత్తమ ప్రతిభ కనబరచారు. ఈ మేరకు ఎంపికైన 9వ తరగతి విద్యార్థులు సీఘన్సాల్, తభిత, వానిషను ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య, పీఈటీలు బాబు, సురేంద్ర అభినందించారు.



